
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



6,050 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నావెలి వల్లి వెంకట రామయ్య (జల్లకుర్రు) రూ.1,00,116 విరాళం అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం 42.0°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	26.0
కాకినాడ	38.3	27.0
అమలాపురం	40.0	26.0

ముగిసిన తొలి ఘట్టం

- పార్లమెంట్‌కు 21 మంది, అసెంబ్లీకి 130 మంది నామినేషన్లు
- ఈనెల 29 నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు

సాక్షి అమలాపురం: సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌ల ఘట్టం పూర్తయ్యింది. అమలాపురం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ఉత్సాహంగా నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. అదే రోజు ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ వచ్చింది. ఎన్నికలకు సంబంధించి మార్చి 16వ తేదీన షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. పార్లమెంట్‌కు జిల్లా కలెక్టరేట్‌లోను, అసెంబ్లీ స్థానాలకు కొత్తపేట, అమలాపురం, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయాలు, రాజోలు, పి.గన్నవరం, ముమ్మిడివరం, మండపేట తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు.

అఖరి రోజు జోరుగా..

జిల్లాలో చివరి రోజు గురువారం పెద్ద ఎత్తున నామినేషన్‌లు వేశారు. రామచంద్రపురంలో పిల్లి సూర్య ప్రకాష్ (వైఎస్సార్ సీపీ), చెక్కా సుజాత, కొయ్య బంగారు బాబు, ఆకెళ్ల ముఖ లింగరావు, వాసంశెట్టి లక్ష్మీ సునీత, వాసంశెట్టి సుభాష్ (టీడీపీ), గుత్తుల పెద రాజు (భారతీయ ప్రజా సేవ), ముమ్మిడివరం నుంచి దాట్ల సుబ్బరాజు (టీడీపీ), రాయుడు శ్రీరామచంద్రమూర్తి, అంగాడి రేవతి, టేకుమూడి వెంకటరావు, దంగేటి రామకృష్ణ, సత్తిరాజు స్వామి (స్వతంత్ర), రాజోలు నుంచి మానుకొండ వెంకట ప్రసాద్ (జాతీయ జనసేన), పోతుమూడి అలివేలు మంగ తాయారు, కొండేటి ప్రభాకర్‌రెడ్డి, బొడ్డిపల్లి నాగేశ్వరరావు, యార్లగడ్డ కృష్ణ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)లు నామినేషన్లు సమర్పించారు.



ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ (ఫైల్)

కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కాంద్రు వెంకటేశ్వరరావు (బీఎస్పీ), చిర్ల జగ్గిరెడ్డి (వైఎస్సార్ సీపీ), అంబారుకాన సుధాకర్, నల్లమిల్లి జ్యోతిరెడ్డి, సలాడి వీర వెంకట దుర్గా సత్యనారాయణమూర్తి, బొచ్చు శ్రీనివాసరావు, సుంకర లక్ష్మి (స్వతంత్ర), సత్యాల అరుణ కిరణ్ (జై భారత్ నేషనల్ పార్టీ), ఒక సెట్, బండారు సత్యానందరావు (టీడీపీ), బండారు శ్రీనివాసరావు (నవరంగ కాంగ్రెస్), పి.గన్నవరం నుంచి నక్కశేఖర్ (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), కొండేటి చిట్టిబాబు (కాంగ్రెస్), గిడ్డి సత్యనారాయణ (జాతీయ జనసేన), గిడ్డి సత్యనారాయణ, గన్నవరపు చంద్ర ఆనంద్, నాగాబత్తుల హేమంత్‌కుమార్ (స్వతంత్ర), విప్పర్తి వేణు గోపాలరావు (వైఎస్సార్ సీపీ), అమలాపురం నుంచి అయితా బత్తుల ఆనందరావు, అయితాబత్తుల అరుణ (టీడీపీ), పరమట శ్యామ్‌కుమార్, వరసాల సత్యనారాయణ, చిట్టిగొళ్ల వీర వెంకట సత్యనారాయణ, జంగా రాజేంద్రకుమార్, ఉందూరు బాబ్జి, ఎన్నాబత్తుల సాయికిరణ్, బీరా రామారావు, ఎం.సత్యనారాయణ (స్వతంత్ర), పాలమూరు మోహన్ బాబు (బీఎస్పీ), అయితా బత్తుల సుబ్బలక్ష్మి (కాంగ్రెస్), దేవరపల్లి రాజు (జై భారత్ నేషనల్ పార్టీ), పినిపే విశ్వరూప్ (వైఎస్సార్ సీపీ), అయితాబత్తుల ఆనందబాబు (నవరంగ్ పార్టీ), బొజ్జ ఐశ్వర్య (లిబరేషన్ కాంగ్రెస్), అయితాబత్తుల అభిమన్యు (జాతీయ జనసేన), మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జి.కోటయ్య (బీఎస్పీ), కోన వీర వెంకట సత్యనారాయణ, కోన శ్రీకృష్ణ (స్వతంత్ర) నామినేషన్లు సమర్పించారు.

పార్లమెంట్‌కు ఇలా..

సాధారణ ఎన్నికలకు సంబంధించి చివరి రోజు గురువారం అమలాపురం పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పెద్ద ఎత్తున నామినేషన్‌లు పడ్డాయి. పార్లమెంట్‌కు సంబంధించి ఏడుగురు అభ్యర్థులు 15 సెట్ల నామినేషన్‌లు సమర్పించారు. కలెక్టర్, అమలాపురం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హిమాన్షు శుక్లాకు వారు నామినేషన్ పత్రాలు అందజేశారు. పార్లమెంట్ సభ్యుని స్థానానికి మొత్తం 21 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్లను సమర్పించారు. మధుసూదనరావు, కొండేటి ప్రభాకరరావు, వడ్డీ లలిత కుమార్ (స్వతంత్ర), అభ్యర్థిగా మధుసూదన రావు, ముత్తా కృష్ణ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), రాపాక వెంకట్‌రామ్ (వైఎస్సార్ సీపీ), నక్కా సునీల్‌రాజ్ (టీడీపీ), పాతూరి రమేష్ (పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా)లు నామినేషన్ దాఖలు చేశారు.

అసెంబ్లీకి..

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను మొత్తం 130 మంది అభ్యర్థులు 211 నామినేషన్లు వేశారు.

అమలాపురం

అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గానికి 21 మంది 42 సెట్‌ల నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్, టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు నామినేషన్లు దాఖలు చేశారు.

కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గం నుంచి మొత్తం 18 మంది 28 సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడ అధికార వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నామినేషన్‌లు వేశారు.

పి.గన్నవరం

పి.గన్నవరం ఎస్సీ నియోజకవర్గం నుంచి మొత్తం 17 మంది 25 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జనసేన తరఫున గిడ్డి సత్యనారాయణ నామినేషన్లు సమర్పించారు.

రాజోలు

రాజోలు ఎస్సీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 15 మంది అభ్యర్థులు 21 నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ తరఫున గొల్లపల్లి సూర్యారావు, జనసేన తరఫున దేవ వరప్రసాద్ నామినేషన్‌లు దాఖలు చేశారు.

మండపేట

మండపేట అసెంబ్లీ నుంచి 16 మంది అభ్యర్థులు 25 మంది నామినేషన్‌లు వేశారు. వీరిలో అధికార వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, టీడీపీ తరఫున ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు నామినేషన్‌లు అందజేశారు.

రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గం నుంచి మొత్తం 21 మంది పోటీ చేసేందుకు నామినేషన్‌లు వేశారు. మొత్తం 32 మంది నామినేషన్‌లు పడ్డాయి. ఇక్కడ నుంచి అధికార వైఎస్సార్ సీపీ తరఫున పిల్లి సూర్యప్రకాష్, టీడీపీ తరఫున వాసంశెట్టి సుభాష్ నామినేషన్ వేశారు.

ముమ్మిడివరం

ముమ్మిడివరం నుంచి మొత్తం 22 మంది అభ్యర్థులు 38 మంది నామినేషన్‌లు వేశారు. వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) నామినేషన్‌లు సమర్పించారు.

న్యూస్‌రీల్

ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం తగదు

– జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



షేక్ అబ్దుల్ ఖాదర్

అమలాపురం టౌన్: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అమలవుతున్న ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను ఎన్డీఏ కూటమి నాయకులు రద్దు చేస్తామని తరుచూ చేస్తున్న ప్రకటనలను జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ ఖండించారు. ఈ మేరకు ఖాదర్ అమలాపురంలో బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎన్డీఏ కూటమి నాయకులు ముస్లిం రిజర్వేషన్లపై చేస్తున్న కుట్ర పూరిత ప్రచారం సరికాదని పేర్కొన్నారు. నాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింల్లో ఉన్న పేదరికాన్ని కమిషన్లు, సర్వేల ఆధారంగా గుర్తించి 4 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు. ముస్లింలకు విద్యా, ఉపాధి రంగాల్లో ఎంతో మేలు చేస్తున్న రిజర్వేషన్లను రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటించడంపై ఖాదర్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ వైఖరిని రాష్ట్రంలోని ముస్లిం సమాజం ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ఆయా పార్టీలకు బుద్ధి చెప్పాలని ఖాదర్ విజ్ఞప్తి చేశారు.

ముస్లిం రిజర్వేషన్లపై ఆ పార్టీల వైఖరి ఏంటి?



ఎండీవై షరీఫ్

మామిడికుదురు: ముస్లిం రిజర్వేషన్లపై టీడీపీ, జనసేన పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీవై షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం మామిడికుదురులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు విద్యా, ఉపాధి రంగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి ఎంతో అండగా నిలిచారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు ఎన్నో ప్రోత్సాహాలు అందిస్తూ తండ్రి బాటలోనే పయనిస్తున్నారన్నారు. బీజేపీ మాత్రం ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నేతలు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ తమను కలవరపాటుకు గురిచేస్తున్నారని అన్నారు. దీనిపై టీడీపీ, జనసేన పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేసి ఎన్నికలకు వెళ్లాలని షరీఫ్ డిమాండ్ చేశారు.

పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్‌ను కలిసిన ఎస్పీ శ్రీధర్



అబ్జర్వర్ చంద్రకాంత్‌కు మొక్క అందజేస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమితులైన పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్‌ను జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ అమలాపురంలో గురువారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఎస్పీ శ్రీధర్ ఆయనను కలిసి కొద్దిసేపు మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల సందర్భంగా అక్రమ రవాణా నియంత్రణ, సీజ్ చేస్తున్న నగదు, మద్యం తదితర అంశాలను అబ్జర్వర్ చంద్రకాంత్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది.

రేపు పాలిసెట్

- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు
- జిల్లాలో 4,830 మంది దరఖాస్తు
- 14 పరీక్షా కేంద్రాల కేటాయింపు

రాయవరం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి శనివారం పాలిసెట్–2024 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రవేశ పరీక్షకు గంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

4,830 మంది దరఖాస్తు

పాలిసెట్–2024కు జిల్లావ్యాప్తంగా 4,830 మంది దరఖాస్తు చేసుకున్నారు. 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో రామచంద్రపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉండగా, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ఐదు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కోర్సులు అందుబాటులో ఉంటాయి. రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 33, మెకానికల్ 33 సీట్లు ఉండగా, ఐదు ప్రైవేట్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 1,500 సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 10 గంటల నుంచి అనుమతిస్తారు.

వయో వృద్ధులు, దివ్యాంగుల కోసం హోమ్ ఓటింగ్

– కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: పోలింగ్ కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న వయో వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. సాధారణ ఎన్నికలు–2024 లో ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఎన్నికల సంఘం చేపట్టిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకే హోమ్ ఓటింగ్ విధానం అమలు చేస్తోందన్నారు. దానికోసం అవగాహన కార్యక్రమాలతో పాటు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోందని పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్లు, ఫెసిలిటేషన్ సెంటర్లను కొత్తగా అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఎన్నికల సంఘం అధికారులు భావిస్తున్నారు. ఇందులో 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధ ఓటర్లు, 40 శాతం వికలాంగత్వం పైబడి సదరమ్ ధ్రువపత్రం కలిగిన దివ్యాంగ ఓటర్లు అర్హులని వీరికి హోమ్ ఓటింగ్ చేసేందుకు అవకాశం కల్పించారు. ప్రతి పోలింగ్ బూతుకు సంబంధించిన ఎన్నికల అధికారులు సర్వే చేసి హోమ్ ఓటింగ్‌కి అర్హులైన ఓటర్లకు ఫారం .12 డీఅందించి హోమ్ ఓటింగ్‌కు చర్యలు చేపట్టారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తిగా వచ్చింది. త్వరలో హోమ్ ఓటింగ్ నిర్వహణకు బూత్ లెవల్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. పోలింగ్ స్టేషన్లో మూడవ కంటికి తెలియకుండా ఎలాగైతే ఏర్పాట్లు ఉంటాయో అదే తరహాలో ఇంటి వద్ద కూడా ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికలను పారదర్శకంగా జరిపేలా చర్యలు తీసుకుంటుందన్నారు. సర్వీస్ ఓటర్లతో పాటు, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించు కోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ఫలితాల విడుదల

- మెరుగైన ఉత్తీర్ణత కనబర్చిన విద్యార్థులు
- ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 3వ స్థానం
- ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో 7వ స్థానం

రాయవరం: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కోనసీమ జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. గత నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలవగా, ఇంటర్ ఫలితాల్లో 7వ స్థానంలో నిలిచింది. ఏపీ ఓపెన్ స్కూల్ పదవ తరగతికి జిల్లా నుంచి 1,251 మంది పరీక్షలకు హాజరు కాగా, 1,104 మంది విద్యార్థులు 88.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాన్ని సాధించారు. ఇంటర్మీడియేట్ పరీక్షలకు 5,089 మంది హాజరు కాగా, 4,118 మంది విద్యార్థులు 80.92 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఏపీ ఓపెన్ స్కూల్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ తెలిపారు.

జగన్ పాలనకు ఆకర్షితులై..

- వైఎస్సార్ సీపీలో చేరిన 100 మంది టీడీపీ, జనసేన నాయకులు
- ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుతో కలిసి ప్రచారం

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులవ్వడంతో పాటు చంద్రబాబు అండ్ కో దుష్ట కూటమి కలయికను నిరసిస్తూ టీడీపీ, జనసేన పార్టీల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. కె.పెదపూడి, వాకలగరువు ఫిషర్‌మ్యాన్‌పేటలలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు 100 మంది ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు సమక్షంలో గురువారం చేరారు. కె.పెదపూడిలో బుధవారం రాత్రి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బీర సురేష్, అతని అనుచరులు 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వాకలగరువు ఫిషర్‌మ్యాన్ పేటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్వర్యంలో టీడీపీ, జనసేనకు చెందిన 50 కుటుంబాల వారు వేణుగోపాలరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని అందుకు అందరూ ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర నాయకులు స్టాలిన్‌బాబు, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్‌లు మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యుల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కుడుపూడి శ్రీనివాస్, ముత్తాబత్తుల మణిరత్నం, గోగి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



వాకలగరువులో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

మలేరియాను తరిమికొడదాం

- డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర
- అమలాపురంలో అవగాహన ర్యాలీ

అమలాపురం టౌన్: మలేరియా జ్వరాలను ప్రజల దరి చేరకుండా పూర్తిగా తరిమికొట్టి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఆవిష్కరిద్దామని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణంలో గురువారం ఉదయం నిర్వహించిన అవగాహన ర్యాలీలో డాక్టర్ దుర్గారావు దొర ప్రసంగించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ గడియారం స్తంభం వరకూ సాగింది. జిల్లా మలేరియా నియంత్రణ అధికారిణి డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మి మాట్లాడుతూ ప్రజలంతా మలేరియా వ్యతిరేక పోరాటానికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. మలేరియా ఏ కారణాలతో వస్తుంది. దాని నియంత్రణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆమె వివరించారు. తొలుత ర్యాలీని డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర జెండా ఊపి ప్రారంభించారు. మలేరియాను అరికడదాం... నివారణకు పోరాటం సల్పుతామంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ నాగ సతీష్, పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ సూర్యనగేష్, డాక్టర్ ఏసేపు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై.ఆదినారాయణ, ఎన్వీ రామారావు, ఫైలేరియా పర్యవేక్షకుడు ఎస్.సత్యనారాయణ, టీబీ యూనిట్ సిబ్బంది సీహెచ్ రాఘవేంద్రరావు, జి.శ్రీహరి, మున్సిపల్ శానిటేషన్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ భారతలక్ష్మి తదితరులు

సమర్థంగా ఎన్నికల విధులు





అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్. చిత్రంలో ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా, సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు

జిల్లాలో ఏర్పాట్లపై పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్ సమీక్ష

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలను జిల్లా పోలీసు శాఖ అత్యంత సమర్థంగా నిర్వహించి నిఘా బృందాలతో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా ప్రశాంత వాతారణంలో సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ ఆదేశించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో గురువారం ఎన్నికల నిర్వహణ, నిఘా బృందాలు, బందోబస్తు, ఏర్పాట్లు తదితర అంశాలపై చంద్రకాంత్ సమీక్షించారు. ఎస్పీ సుసరావు శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా పాల్గొని ఇప్పటి వరకూ జిల్లాలో ఎన్నికల సందర్భంగా నిఘా బృందాల ద్వారా నిర్వహించిన దాడులు, తనిఖీలు, స్వాధీనం చేసుకున్న మద్యం, సీజ్ చేసిన నగదు వంటి వివరాలతో నివేదిక ఇచ్చారు. ఎన్నికల నియమావళి అమలు జరుగుతున్న తీరుపై చంద్రకాంత్ చర్చించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాల కవాతులు, సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓట్లు వేసేలా ఇస్తున్న భరోసాపై కూడా చంద్రకాంత్ ఆరా తీశారు.

నగదు, మద్యం భారీ ఎత్తున స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిఘా బృందాలు బుధ,గురువారాల్లో తనిఖీలు, దాడులు చేసి మద్యం, నగదులను భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నాయి. ఈ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం గురువారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- జిల్లాలో నిర్వహించిన దాడుల్లో 9 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 4 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 49 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 12 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- సఖినేటిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,100 నగదు సీజ్ చేశారు.
- జిల్లాలో నిఘా బృందాలు తనిఖీలు చేసి రూ.2.20 లక్షల నగదును సీజ్ చేశాయి.
- అయినవిల్లి మండలం పోలీసు స్టేషన్ పరిధిలో రూ.4.50 లక్షలు, మండపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.1.80 లక్షల నగదును సీజ్ చేశారు.
- ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3.68 లక్షల విలువైన 3,072 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 552.96 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాకు ఆరుగురు వ్యయ పరిశీలకులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణకు సంబంధించి సాధారణ ,వ్యయ పరిశీలకులుగా ఆరుగురు ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐపీఎస్ కేడర్లకు చెందిన అధికారులు నియమితులైనట్టు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ ఆరుగురు అధికారులు మలికిపురం మండలం దిండి ఆర్‌వీఆర్ సరోవర్ అందుబాటులో ఉంటారన్నారు.

రూమ్ నంబర్ 1119లో ఐఏఎస్ అధికారి రాజేశ్వ ర్ గోయల్, రూమ్ నంబర్ 1120లో ఐఏఎస్ ప్రదీప్‌కుమార్, రూమ్ నంబర్ 1121లో ఐపీఎస్ అధికారి సీవీ చంద్రకాంత్ , రూమ్ నంబర్ 1122లో ఐఆర్ఎస్ అధికారి ఉమేష్ కుమార్, రూమ్ నంబర్ 1123లో ఐఆర్ఎస్ సుమిత్ దాసుగుప్త, రూమ్ నంబర్ 1124లో ఐఆర్ఎస్ అధికారి రాహుల్ దింగ్రాలు ఉంటున్నారు. సాధారణ పరిశీలకులుగా నియమితులైన రాజేశ్వర్ గోయల్ (సెల్.89789 62588) అమలాపురం పార్లమెంటు, పి. గన్నవరం రాజోలు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారని తెలిపారు. మరో సాధారణ పరిశీలకుడు పరదీప్ కుమార్ ఐఏఎస్ (సెల్ 897750 2588) ముమ్మిడివరం, రామచం ద్రపురం, మండపేట, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తార ని తెలిపారు. పోలీస్ పరిశీలకులుగా నియమితులైన ఎంవీ చంద్రకాంత్ (సెల్ 78932 56556) అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో పోలీసు సంబంధిత సాధారణ ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారని తెలిపారు.


వ్యయ పరిశీలకుడిగా అమలాపురం పార్లమెంటుకు నియమితులైన ఉమేష్ కుమార్ (సెల్ 78935 12588) అభ్యర్థుల వ్యయాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. రాహుల్ దింగ్రా (సెల్. 89784 52588) ముమ్మిడివరం, రామచంద్రపురం మండపేట అసెంబ్లీ నియోజక వర్గాలలో అభ్యర్థుల వ్యయాలను పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. మరోవ్యయ పరిశీలకుడు సుమిత్ దాస్ గుప్తా ఐఆర్ఎస్ (సెల్ 73308 62588) రాజోలు, పి గన్నవరం అమలాపురం అసెంబ్లీ నియోజక వర్గాలలో అభ్యర్థుల వ్యయాలను పర్యవేక్షిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

సత్యదేవుని కొత్త రథం నేడు ప్రారంభం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1.08 కోట్లు వ్యయంతో నిర్మించిన నూతన టేకు రథాన్ని శుక్రవారం ఉదయం పది గంటలకు లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. ఈ రథానికి ఆరు చక్రాలు అమర్చే పనులు చురుకుగా జరుగుతున్నాయి. సత్యదేవుని పాత నివేదనశాలలో శుక్రవారం నుంచి స్వామి, అమ్మవార్లకు నివేదనలు తయారు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఈ నివేదన శాలను సర్క్యులర్ మంటపం మీద షెడ్డు నిర్మించి మార్పు చేశారు. అయితే ఆలయ ప్రాకారంలోనే నివేదనశాల ఉండాలనే ఉద్దేశంతో పాత నివేదనశాలకు మరమ్మతులు చేయించారు.

జేఈఈ(మెయిన్స్)-2024 ఫలితాలలో తిరుమల ప్రభంజనం



విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్స్ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో తమ విద్యార్థులు యు.సుదీర్ 34వ ర్యాంకు, ఎంజి వెంకటమహేష్ 37వర్యాంకు, కేజే వెంకటసాయి 57వ ర్యాంకు, ఆర్.పవిత్ర 90వ ర్యాంకు, ఎం.చరణ్‌శ్రీతేజ 118వ ర్యాంకు, జి.వంశీకృష్ణ 123వ ర్యాంకు, పి.దినేష్ 141వ ర్యాంకు, ఎం.వినేష్‌కుమార్ 145వ ర్యాంకు, ఎంఆర్ఎస్‌వీఎస్ శ్రీమణికంఠ 149వ ర్యాంకు, జీఎస్ దుర్గసాయి 168వ ర్యాంకు సాధించారని ఆయన తెలిపారు. వీటితో పాటుగా 210, 217, 221, 223, 224, 225, 238, 253, 255, 261 ,265, 277, 288, 291 ర్యాంకులు సాధించారన్నారు. 1,000లోపు 58 మంది, 5,000లోపు 254 మంది, 10,000లోపు 417 మంది, 20,000లోపు 654 మంది ర్యాంకులు సాధించారని, కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 1358 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొంది 92శాతం సక్సెస్ రేటు సాధించారని నున్న తిరుమలరావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

నిబంధనలను 'గుర్తు' పెట్టుకుని..

- అభ్యర్థులకు సింబల్ కేటాయింపు
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలు



ఎన్నికల గుర్తులు



ఈవీఎం బ్యాలెట్ పేపర్‌లో గుర్తులు

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ వారికి ఆ గుర్తు కేటాయిస్తారు. స్వతంత్రులకు మాత్రం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన గుర్తులను అభ్యర్థుల పేరును బట్టి అక్షర క్రమంలో (తెలుగులో) కేటాయించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల సంఘం కేటాయించే గుర్తులతో ప్రచారం చేసుకోవాలి. రాష్ట్ర ఎన్నికల సంఘం కొన్ని గుర్తులను ఎంపిక చేసి ఇప్పటికే జిల్లాకు పంపింది.

గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు..

రిజర్వుడ్ గుర్తులు ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థులకు వాటినే కేటాయిస్తారు. అలాగే రిజిస్టరై గుర్తింపు లేని రాజకీయ పార్టీల అభ్యర్థులకు సైతం కేటాయించిన గుర్తులపైనే పోటీ చేసే అవకాశం కల్పిస్తారు. అయితే పోటీలో ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫారం ఎ, ఫారం బి సమర్పించాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రంలో మూడు గుర్తులు కోరాల్సిన అవసరం లేదు. అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారో ఆ పార్టీ గుర్తునే వారు తప్పకుండా పేర్కొనాలి.

స్వతంత్ర అభ్యర్థికి ప్రత్యేకం

స్వతంత్ర అభ్యర్థికి ఆయన మొదటి నామినేషన్ పత్రంలో పేర్కొన్న మూడు గుర్తుల్లో ఒకదానిని మాత్రమే కేటాయిస్తారు. ఒక వేళ మొదటి నామినేషన్‌ను పరిశీలనలో తిరస్కరించినప్పటికీ ఆ తరువాత ఇచ్చిన నామినేషన్ సెట్‌లో వేరే గుర్తులు పేర్కొన్నా, ఆ నామినేషన్ ఆమోదం పొందినప్పటికీ, మొదట ఇచ్చిన నామినేషన్‌లో పేర్కొన్న గుర్తుల్లో ఒక దానినే కేటాయిస్తారు.

ఒకరికి కేటాయిస్తే..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఒకరికి కేటాయించిన గుర్తును మరొక అభ్యర్థికి అదే నియోజకవర్గంలో కేటాయించరు. కొన్ని సందర్భాల్లో రిజిస్టరై గుర్తింపు లేని పార్టీలకు గుర్తులు కేటాయింపు కాకపోతే, అలాంటి క్రమంలో వారు ఫ్రీ గుర్తుల నుంచి మూడు కోరుకోవచ్చు. వాటిలో నుంచి ఒకదానిని కేటాయిస్తారు. ఆ గుర్తును స్వతంత్ర అభ్యర్థికి ఇవ్వరు. ఎవరైనా అభ్యర్థి గతంలో స్వతంత్ర అభ్యర్థిగా ఒక ఫ్రీ గుర్తులో పోటీ చేసి ఉండి, తాజాగా మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తుంటే అతను నామినేషన్‌లో గతంలో తాను పోటీ చేసిన ఫ్రీ గుర్తును తిరిగి కోరితే అదే కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో పలువురు ఒకే గుర్తును కోరుకుంటే లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు.

పొత్తులు పెట్టుకుని ఉంటే..

కొన్ని రాజకీయ పార్టీలు పొత్తులు పెట్టుకుని ఉంటాయి. ఇలాంటి సందర్భంలో ఏ పార్టీ పోటీలో ఉంటే ఆ పార్టీ గుర్తునే ఎన్నికలకు ఉపయోగించాలి. ఒక సందర్భంలో ఏదైనా రిజిస్టరై గుర్తింపు ఉన్న లేక రిజిస్టరై గుర్తింపు లేని పార్టీ అభ్యర్థులు నామినేషన్ చేస్తారు. నామినేషన్ గడువు చివరి తేదీలోపు ఫారం ఎ, ఫారం బి ఇవ్వకపోతే వారు పది మంది ప్రతిపాదకులతో నామినేషన్ ఇచ్చి ఉంటే వారికి ఫ్రీ గుర్తు కేటాయిస్తారు.

టీడీపీ కవ్వింపు చర్యలు

పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

అమలాపురం టౌన్: అమలాపురంలో జరుగుతున్న వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అనుచరులైన కొందరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. సుభాష్ అనుచరులు చేసిన ఈ కవ్వింపు చర్యలను వైఎస్సార్ సీపీ నాయకులు దీటుగా ఎదుర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డులో మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ గురువారం ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా స్థానిక గొల్లగూడెం ప్రాంతంలో సుభాష్ అనుచరుడైన కట్టా మహేష్, మరి కొంతమంది టీడీపీ కార్యకర్తలు రోడ్డుకు అడ్డుగా జీపు ఉంచి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. సుభాష్‌కు అనుకూలంగా నినాదాలు కూడా చేశారు. ఈ పరిణామాలపై వైఎస్సార్ సీపీ నాయకులు కొంత సంయమనం వహించి అక్కడ నుంచి ప్రచారం చేసుకుంటూ వెళ్లిపోయారు. తిరుగు ముఖంలో కూడా అదో చోట రోడ్డుపై జీపును అడ్డుపెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు రాగానే మళ్లీ నినాదాలు చేయడం మొదలు పెట్టారు. దీంతో పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి టీడీపీ కార్యకర్తల ఆగడాలను అదుపు చేశారు. తమ పార్టీ ప్రచారాన్ని అడ్డుకునేందుకు వీరెవరంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని ఘటనా స్థలానికి వచ్చి సుభాష్ వర్గీయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న టీడీపీ కార్యకర్తలను బయటకు రావాలని వైఎస్సార్ సీపీ నాయకులు కేకలు వేసినప్పటికీ వారు రాలేదు. రోడ్డుపై అడ్డుగా పెట్టిన సుభాష్‌కు చెందిన జీపును పోలీసులు అక్కడ నుంచి తొలగించారు. గురువారం సాయంత్రం వరకూ ఇరువర్గాల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, పరిస్థితి ప్రశాంతంగా ఉందని పట్టణ సీఐ క్రిష్టోఫర్ తెలిపారు. ఈ దౌర్జన్య ఘటనపై మంత్రి పినిపే విశ్వరూప్ కూడా స్పందించారు. జరిగిన ఘటనను జిల్లా ఎస్పీ దృష్టికి మంత్రి విశ్వరూప్ తీసుకుని వెళ్లి కవ్వింపు చర్యలపై మాట్లాడారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి హవా



జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన శ్రీషిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జెఈఈ మెయిన్స్ ఫలితాలలో రాజమహేంద్రవరం శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య గురువారం తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న జె.శ్రీకర్ ఆల్ ఇండియా 46వ ర్యాంకు సాధించగా, కె.వెంకట శివరామకృష్ణ ఆల్ ఇండియా 126వ ర్యాంకు, బి.తనుశ్రీ 347వ ర్యాంకు, సీహెచ్.భానువెంకట దీపక్ 794వ ర్యాంకు, ఎం.తన్మయ్‌రామ సంకీర్త్ 850వ ర్యాంకు సాధించారన్నారు. ఐదుగురు విద్యార్థులు 1,000లోపు ర్యాంకులు సాధించగా 16 మంది 2,000లోపు, 38 మంది 5 వేలలోపు ర్యాంకులు, 61 మంది 10వేల లోపు ర్యాంకులు, 82 మంది 20 వేల లోపు ర్యాంకులు సాధించారన్నారు. షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హాజరైన 226 మందిలో 76 శాతం, 172 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

టీడీపీ అభ్యర్థి సేవలో విద్యార్థులు

- ఒక ప్రైవేటు స్కూల్ యాజమాన్యం నిర్వాకం
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు

మండపేట: తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి నీరాజనాలు పట్టించిన ఒక పబ్లిక్ స్కూల్ ఉదంతమిది. మారేడుబాకలో మండపేట పబ్లిక్ స్కూల్ అధినేత వల్లూరి చిన్నారావు శాసనసభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావుకు సన్నిహితుడు. గురువారం వేగుళ్ల మారేడుబాకలో ఎన్నికల ప్రచారానికి వెళుతుండగా ఎంపీఎస్ విద్యార్థులతో పాఠశాల వద్ద పూలవర్షం కురిపించి స్వాగత నీరాజనాలు అర్పించి, తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయాలని నినాదాలు చేయించారు. ఇది కచ్చితంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన అని ఏడిద సీతానగరం సర్పంచ్ వరదా చక్రవర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. విద్యార్థులను ఎన్నికల ప్రచారంలోకి లాగడం ఎంత వరకూ సబబని ఆయన ప్రశ్నించారు. ఎంపీఎస్ కరస్పాండెంట్ చిన్నారావు మారేడబాకలో టీడీపీ అభ్యర్థి గెలుపుకు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని కోరారు.



టీడీపీ అభ్యర్థి వేగుళ్లపై విద్యార్థులతో పూలు చల్లిస్తున్న ఎంపీఎస్ కరస్పాండెంట్ చిన్నారావు

మరో మహిళపై హత్యాయత్నం

ఉప్పలగుప్తం: రెండు రోజుల క్రితం అల్లవరం మండలం రెల్లుగెడ్డ గ్రామంలో బొంతు మణికుమారి అనే వివాహితను హత్య చేసిన కొంబత్తుల నవీన్‌కుమార్ గురువారం ఉదయం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన మరో వివాహితపై హత్యాయత్నం చేశాడు. స్థానికులు, పోలీసుల తెలిపిన కథనం ప్రకారం మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి యెరుబండి చెరువుకు చెందిన ఓ కుటుంబంతో నవీన్‌కుమార్‌కు గత కొన్నేళ్లుగా పరిచయం ఉంది. మంగళవారం రెల్లుగడ్డలో వివాహితను హత్య చేసి అక్కడ నుంచి పరారై పోలీసుల కంట పడకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టిన క్రైమ్ పోలీసులు యెరుబండి చెరువులో అతనికి పరిచయం ఉన్న ఆ కుటుంబం వద్దకు వెళ్లి నవీన్ ఆచూకీ తెలిస్తే తమకు తెలియజేయాలని సూచించారు. గురువారం ఉదయం సమయంలో తెల్లవారే సరికి నవీన్‌కుమార్ యెరుబండి చెరువుకు చేరుకుని తలుపు తట్టగా ఆ ఇంటి ఇల్లాలు నిందుతుణ్ణి నిలదీసి పోలీసులకు సమాచారం అందిస్తానని హెచ్చరించింది. దీంతో నిందితుడు కత్తితో ఆమెపై దాడి చేసి పరారయ్యాడు. తనని రక్షించుకోవడానికి చెయ్యి అడ్డుపెట్టుకున్న మహిళకు చేతిపై బలమైన గాయం అయ్యింది. ఈ సమాచారం తెలుసుకున్న సీఐ పి.వీరబాబు, ఎస్ఐ మనోహర జోషి నిందితుడు ఎస్.యానం గ్రామంలో సంచరిస్తున్నాడని గ్రామస్థులకు సమాచారం ఇవ్వటంతో గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిని పట్టుకుని అల్లవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జోషి తెలిపారు.

మహిళపై దౌర్జన్యం చేసి బంగారు నగ అపహరణ

అమలాపురం టౌన్: ఇంట్లో ఉన్న మహిళపై ఓ అగంతకుడు దౌర్జన్యం చేసి ఆమె మెడలో ఉన్న బంగారు నగను కాజేసి పరారయ్యాడు. అమలాపురం వాసవీ కాలనీలో బుధవారం రాత్రి జరిగిన ఈ చోరీకి సంబంధించిన వివరాలను బాధిత కుటుంబం వివరించింది. ఆ కాలనీకి చెందిన కొత్త శారద మెడలోంచి ఆగంతకుడు రూ.1.50 లక్షల విలువైన మంగళ సూత్రాలతో ఉన్న 50 గ్రాముల బంగారు గొలుసును అపహరించాడు. పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో ఐడీ పార్టీ పోలీసులు జరిగిన చోరీపై లోతుగా విచారిస్తున్నారు. శారద భర్త రాజాపండు బయటకు వెళ్లారు. ఇదే అదనుగా అగంతకుడు ఆ ఇంటికి వెళ్లి రాజాపండు గారు పంపించారు. గాజులు ఆది ఇమ్మనారు అంటూ శారదను నమ్మబలికే ప్రయత్నం చేశాడు. అమాంతంగా అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించి తొలుత చేతినున్న బంగారు గాజులను లాక్కునేందుకు ప్రయత్నించాడు. తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరరాయ్యాడు. మెడలో గొలుసు లాగే సమయంలో ఆమె మెడకు స్వల్ప గాయమైంది. భర్త రాజాపండు ఇంటికి వచ్చిన తర్వాత జరిగిన చోరీపై స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజా పండు ఇంటి పరిసరాలు, రోడ్డులో ఉన్న సీసీ కెమెరాల సీసీ పుటేజీలను పరిశీలించారు. చోరీకి వచ్చిన అగంతకుడు వివరాలను బాధితురాలు శారద పోలీసులకు చెప్పడంతో ఆ దిశగా నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు.

3,072 మద్యం సీసాల పట్టివేత

ఐ.పోలవరం: ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా దాచి ఉంచిన భారీ మద్యం నిల్వలను ఐ.పోలవరం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పశువుల్లంక గ్రామంలో రొయ్యల చెరువు వద్ద అక్రమంగా మద్యం నిల్వలు దాచి ఉంచినట్టు అందిన సమాచారంతో స్థానిక ఎస్ఐ జె.భానుప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. చెరువు వద్ద తనిఖీలు నిర్వహించగా అక్కడున్న పాకలో 3,072 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మద్యం దాచింది ఎవరో విచారణలో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

- అపరాధ రుసుం లేకుండా చెల్లింపునకు మే 4 తుది గడువు
- పరీక్షల టైమ్ టేబుల్ విడుదల
- జూన్ 1 నుంచి 8 వరకు పరీక్షల నిర్వహణ

రాయవరం: ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసిన నేపథ్యంలో సంబంధిత అధికారులు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను కూడా వెంటనే విడుదల చేశారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం సంచాలకులు కె.నాగేశ్వరరావు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఏపీ ఓపెన్ స్కూల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. పరీక్ష ఫీజుల చెల్లింపు తేదీలను ప్రకటించగా, పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

పరీక్ష ఫీజు చెల్లించాలిలా..

అపరాధ రుసుం లేకుండా ఈ నెల 29 నుంచి మే 4వ తేదీ వరకు చెల్లించవచ్చు. ఒక సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో మే 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు చెల్లించవచ్చు. ఒక సబ్జెక్టుకు రూ.50 అపరాధ రుసుంతో మే 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు, తత్కాల్ విధానంలో మే 9,10 తేదీల్లో పరీక్ష ఫీజును చెల్లించేందుకు గడువు ఇచ్చారు. పదవ తరగతి థియరీ ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.95లు, ఇంటర్మీడియెట్ థియరీ ఒక సబ్జెక్టుకు రూ.5 రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.145 పరీక్ష ఫీజు, ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.95 చెల్లించాలి. ఉత్తీర్ణులు కాని ఇంటర్మీడియెట్ అభ్యాసకులు ఉత్తీర్ణత పొందిన సబ్జెక్టు ఒక్కింటికి ఇంప్రూవ్‌మెంట్‌కు థియరీ ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ నిమిత్తం రూ.5, పరీక్ష ఫీజు రూ.245, ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్‌కు రూ.5, పరీక్ష ఫీజుగా రూ.95 చెల్లించాలి. ఈ సదుపాయాన్ని ఐదేళ్ల కాలంలో ఒక్కసారి మాత్రమే అభ్యాసకులు వినియోగించుకోవచ్చు.

ఈ విషయాలను గమనించాలి

పరీక్ష ఫీజు చెల్లించడానికి 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది, 31-08-2023 నాటికి ఎస్ఎస్‌సీ అభ్యర్థులు 14 ఏళ్లు, ఇంటర్ అభ్యర్థులకు 15ఏళ్లు వయస్సు నిండి ఉండాలి. ఇంతకు పూర్వం విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది పరీక్షకు హాజరై తప్పిన అభ్యర్థులు, ఇంతకు ముందు విద్యా సంవత్సరాల్లో ప్రవేశం పొంది ఇంత వరకు పరీక్షకు హాజరు కాని అభ్యర్థులు అర్హులు. పరీక్ష రుసుమును ఏపీటీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలి. డీడీ/చలానా రూపంలో స్వీకరించరు. ఒకసారి పరీక్ష చెల్లించిన పరీక్ష రుసుమును వాపసు ఇవ్వరు. ఏపీటీ ఆన్‌లైన్ వచ్చిన ఫీజు రసీదును భద్రపర్చుకోవాల్సి ఉంటుంది. ఫీజు చెల్లించిన రసీదులో సబ్జెక్టులను సరిచూసుకోవాలి. సరైన సబ్జెక్టులకు ఫీజు చెల్లించకపోతే మరొకసారి ఫీజు చెల్లించవలసి వస్తుంది. దివ్యాంగులు పరీక్ష ఫీజు నుంచి మినహాయింపబడిన వారు, పరీక్షలు రాసే సబ్జెక్టులను సరిచూసుకోవాలి. సరైన సబ్జెక్టులకు ఫీజు చెల్లించనచో, మరొకసారి ఫీజు చెల్లించవలసి వస్తుంది. ఒక సబ్జెక్టుకు కట్టిన రుసుము మరొక సబ్జెక్టునకు బదలాయించరు. ఫీజు చెల్లించిన సబ్జెక్టులకు మాత్రమే పరీక్షకు అనుమతిస్తారు. పరీక్ష రుసుం లేకుండా ఏదేని సబ్జెక్టు/సబ్జెక్టులకు హాజరైన పరీక్షలను ముందస్తు నోటీసు లేకుండా రద్దు చేస్తారు. కనీస వయస్సు లేని వారు ఫీజు చెల్లించి పరీక్షకు హాజరైతే వారి ప్రవేశం, పరీక్షలు రద్దు చేస్తారు. ఏదైనా కారణంతో పరీక్ష ఫీజు చెల్లించడానికి నిర్ణయించిన ఆఖరి తేదీని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటిస్తే ఆ మరుసటి రోజు పరీక్ష ఫీజు చెల్లించడానికి ఆఖరి రోజు అవుతుంది.

పరీక్షల టైమ్ టేబుల్ ఇదీ..

ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంటర్ జనరల్, వృత్తి విద్యా కోర్సులకు ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి జూన్ 12వ తేదీ వరకు నిర్వహిస్తారు.